క్లుప్తంగా

నేడు నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ముత్తుకూరు: మండలంలోని నేలటూరు పంచాయతీలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణు వర్ధన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దళితవాడ నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

జొన్నవాడ ఆలయ ఈఓగా వెంకటేశ్వర్లు


నూతన ఈఓను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయ ఈఓగా డబ్బుగుంట వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆలయ ఈఓగా ఉన్న వెంకటసుబ్బయ్య బదిలీ కాగా, ఆయన స్థానంలో వెంకటేశ్వర్లు ఈఓగా బాధ్యతలు చేపట్టారు. నూతన ఈఓను ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు శాలువాతో సత్కరించారు. పాలక మండలి సభ్యులు తిరువాయిపాటి నందకుమార్, గుమ్మా రఘురామయ్య, అర్చకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో నూరుశాతం ఉత్తీర్ణత

కొడవలూరు: నార్తురాజుపాళెం ప్రభుత్వ హైస్కూల్ ప్లస్‌లోని మొదటి సంవత్సరం ఇంటర్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. నార్తురాజుపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2022–23 విద్యా సంవత్సరంలో కొత్తగా ప్రభుత్వం హైస్కూల్ ప్లస్‌ను ప్రారంభించింది. ఇందులో ప్రథమ సంవత్సరం ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు కలిపి 14 మంది విద్యార్థులు చేరారు. బుధవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో 14 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ విభాగంలో పీ చైతన్య జ్యోతి 470 మార్కులకు గానూ 408 మార్కులు, బైపీసీ విభాగంలో యూ మనోజ్ఞ 440 మార్కులకు 399 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులను ఎంఈఓ జీ వసంతకుమారి, హెచ్‌ఎం ఓబులేసు ప్రత్యేకంగా అభినందించారు.

ఉచిత వైద్యశిబిరం



కొడవలూరు: స్థానిక ఎన్టీఆర్ కాలనీలో శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్మార్ట్ విజన్ ఐ ఆస్పత్రి, కొండారెడ్డి డెంటల్ ఆస్పత్రుల వైద్యులు కాలనీలోని 200 మందికి కంటి, దంత పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ పీ కుమార్‌బాబు, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి టీ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌ల ఢీ- ఇద్దరు యువకులకు గాయాలు


గాయపడిన యువకులు

బుచ్చిరెడ్డిపాళెం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రగాయాలపాలయ్యారు. ఈ ఘటన మండలంలోని సాల్మన్‌పురం వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు..మండలంలోని పెనుబల్లికి చెందిన పొట్టే వికాస్ బైక్‌పై బుచ్చిరెడ్డిపాళేనికి వస్తున్నాడు. పంచేడుకు చెందిన మరో యువకుడు బైక్‌పై నెల్లూరు వెళుతున్నాడు. సాల్మన్‌పురం వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా బలంగా ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విశేషాలంకారంలో మూలస్థానేశ్వరుడు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయంలో వసంతోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. స్వామివారు కిరాతార్జునీయ అలంకారంలో బుధవారం దర్శనమిచ్చారు. ఉభయకర్తగా ధరణికృష్ణ వ్యవహరించారు.

గంగపుత్రుల సంక్షేమానికి పెద్దపీట

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి


పట్టపుపాళెంలో సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గంగపుత్రుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా నేలటూరు పంచాయతీ పరిధిలోని పట్టపుపాళెంలో బుధవారం ఆయన పర్యటించారు. తొలుత మంత్రికి మత్స్యకారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని మంత్రి ప్రారంభించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకార భరోసా పథకం ద్వారా చేపలవేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబానికి రూ.10వేలు సాయం అందజేస్తుందన్నారు. పడవలకు డీజిల్‌పై సబ్సిడీని ఇస్తుందని తెలిపారు. మత్స్యకారుడు సముద్రంలో ప్రమాదవశాత్తు మునిగిచనిపోతే గతంలో రూ.5 లక్షలు పరిహారం ఇస్తుండగా, తమ ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచిందని గుర్తుచేశారు.

గ్రామం తరలింపు ప్రక్రియ వేగవంతం

కాలుష్యం కోరల్లో చిక్కుకున్న పట్టపుపాళేన్ని సురక్షిత ప్రాంతానికి తరలించే ప్రక్రియను వేగవంతం చేస్తామని మంత్రి కాకాణి భరోసా ఇచ్చారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కాలనీ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆహ్వానిస్తామన్నారు. గ్రామస్తులకు ఇవ్వాల్సిన నష్టపరిహారంపైన చర్చిస్తామన్నారు. రాబోయే రోజుల్లో అర్హత కలిగిన ప్రతికుటుంబానికి సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, మాజీ జెడ్పీటీసీ నెల్లూరు శివప్రసాద్, భక్తాని కనకయ్య, నాయకులు సీపారెడ్డి రామమోహన్‌రెడ్డి, ఈపూరు కోటారెడ్డి, గిరిధర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మునుకూరు రవికుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోఆపరేటివ్ బ్యాంకుల అభివృద్ధికి రూ.295 కోట్లు

• మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి


వివరాలను పరిశీలిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : కోఆపరేటివ్ బ్యాంకుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మూలధన నిధి కింద రూ.295 కోట్లను మంజూరు చేసిందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు కోఆపరేటివ్ బ్యాంకును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ వవ్వేరు కోఆపరేటివ్ బ్యాంకు రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. ఖాతాదారుల లావాదేవీలు, మూలధన నిల్వ, రుణాల మంజూరు విషయంలో బ్యాంకుకు ఘన చరిత్ర ఉందన్నారు. కో–ఆపరేటివ్ బ్యాంకులు మహిళా సంఘాలకు తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తుండడంతో వాణిజ్య బ్యాంకుల వారు ముఖ్యమంత్రిని కలిసి తక్కువ వడ్డీ రుణాలను ఆపాలని కోరారని గుర్తుచేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటలకు రుణాలు అందించే విధంగా కో–ఆపరేటివ్ బ్యాంకులను ప్రోత్సహిస్తోందని తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆలోచన మేరకు వవ్వేరు బ్యాంకు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,005 గోదాములు, ప్లాట్‌ఫామ్‌లు మొదటి దశలో మంజూరయ్యాయని తెలిపారు. రెండో దశలో 1,018 గోదాములు, వాటికి అనుసంధానంగా ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం బ్యాంకు నూతన చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన యర్రంరెడ్డి స్వర్ణను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీఓ సుధాభారతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, మోర్ల మురళీ, కోడూరు మధుసూదన్‌రెడ్డి, మేనకూరు సీతారామిరెడ్డి, అల్లాభక్షు, పిడుగు మధు, చాందిని, కౌన్సిలర్లు ప్రసాద్, యానాదిరెడ్డి, రహమత్ పాల్గొన్నారు.

రైతుపై హత్యాయత్నం

బుచ్చిరెడ్డిపాళెం: తనపై పెట్టిన కేసును వాపస్ తీసుకోవాలని ఓ వ్యక్తి రైతును బెదిరించడమే కాకుండా పారతో దాడి చేసి హత్యాయత్నం చేయబోయాడు. ఈ ఘటన మినగల్లు పాలాల్లో బుధవారం చోటు చేసుకుంది. బాధితుడు అల్లం శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు..మినగల్లు గ్రామానికి చెందిన అల్లం శ్రీనివాసులు తన ట్రాక్టర్లను గ్రామానికి చెందిన జయసూర్య అడ్డుకుంటున్నాడని గతంలో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో శ్రీనివాసులు బుధవారం పొలంలో ఉండగా కేసును వాపస్ తీసుకోవాలని బెదిరిస్తూ జయసూర్య పారతో దాడి చేసి గాయపరిచాడు. అల్లం శ్రీనివాసులు తప్పించుకుని పోలీసులను ఆశ్రయించగా, చికిత్స నిమిత్తం సీహెచ్‌సీకి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరప్రతాప్ తెలిపారు.

నేడు ఏఆర్‌ఎస్‌లో నిమ్మ రైతులకు శిక్షణ

పొదలకూరు : స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం(ఏఆర్‌ఎస్)లో నిమ్మ రైతులకు గురువారం ఉదయం 10.30 గంటలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉద్యానాధికారి ఆనంద్ బుధవారం తెలిపారు. శాస్త్రవేత్తలు, ఉద్యానాధికారులు వేసవిలో నిమ్మతోటల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలురకాల సూచనలు, సలహాలు అందజేస్తారని చెప్పారు. నిమ్మ రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాలు

పొదలకూరు : పొదలకూరు–2, డేగపూడి, తాటిపర్తి సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. వారం రోజుల పాటు ఆధార్ ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయని ఎంపీడీఓ నగేష్‌కుమారి బుధవారం తెలిపారు. ప్రత్యేక శిబిరాల్లో ప్రతిఒక్కరూ ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

నకిలీ వైద్యుడిపై అప్రమత్తంగా ఉండాలి

పొదలకూరు : వైద్యారోగ్యశాఖ నుంచి వస్తున్నానని, తన పేరు డాక్టర్ శివారెడ్డి అని చెప్పుకుంటూ నగదు వసూలు చేస్తున్న నకిలీ డాక్టర్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి ఎం రమేష్ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శివారెడ్డి వైద్యారోగ్యశాఖకు సంబంధించిన వ్యక్తి కాదన్నారు. వైద్యారోగ్యశాఖ అధికారులు, ఉద్యోగులు ఎవరిని నగదు అడగరని తెలిపారు. ఎవరైనా అపరిచితులు వైద్యారోగ్యశాఖ పేరు చెప్పి నగదు అడిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో- వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్‌ను ఆటో ఢీకొనడంతో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన కసుమూరు వద్ద బుధవారం చోటు చేసుకుంది. బుజబుజనెల్లూరు ప్రాంతానికి చెందిన షేక్ రసూల్ పని నిమిత్తం బైక్‌పై కసుమూరు వెళ్లి తిరిగి వస్తున్నాడు. కసుమూరు మలుపు వద్ద వెనుకగా బైక్‌ను ఆటో ఢీకొనడంతో రసూల్ గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు అందుబాటులోకి నానో లిక్విడ్ డీఏపీ


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

తోటపల్లిగూడూరు: రానున్న ఖరీఫ్ సీజన్ నుంచి రైతులకు నానో లిక్విడ్ డీఏపీని అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఇఫ్కో జిల్లా మేనేజర్ లక్ష్మీనారాయణ తెలిపారు. నరుకూరు రైతుభరోసా కేంద్రంలో నానో లిక్విడ్ డీఏపీపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో లిక్విడ్ డీఏపీతో పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవడమే కాకుండా అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. నానో డీఏపీ నేలను సారవంతం చేయడంతో పాటు పర్యావరణాన్ని రక్షించడంలోనూ తోడ్పడుతుందన్నారు. నానో లిక్విడ్ డీఏపీ అర లీటర్ బాటిల్ ధర రూ.600 అని తెలిపారు. ఇది రూ.1350 విలువైన 50 కేజీల డీఏపీతో సమానమని తెలిపారు. దీనిపై రైతులు అవగాహన పెంచుకుని వినియోగించుకుని లబ్ధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమం ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్, మండల ఏఓ గీతాకుమారి, ఇఫ్కోట్రెయినీ సతీష్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల కృషి భేష్


మాట్లాడుతున్న డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు

కొడవలూరు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల కృషి ప్రశంసనీయమని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు కొనియాడారు. రాష్ట్రంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా కోటి గృహాలను సందర్శించిన సందర్భంగా నార్తురాజుపాళెంలోని వీసీఆర్ అతిథిగృహంలో బుధవారం సాయంత్రం విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వంలో నిమగ్నమై ఉన్నా పార్టీ నాయకుల సహకారంతో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేశారని చెప్పారు. రాష్ట్రంలో పార్టీలకతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేయడం ప్రతిఇంటా ప్రభుత్వంపై సానుకూల స్పందన కన్పిస్తోందన్నారు. గతంలో ఏ పథకం పొందాలన్నా జన్మభూమి కమిటీల సిఫార్సు అవసరం ఉండేదన్నారు. ఇప్పుడు ఎవ్వరి సిఫార్సులు అవసరం లేకుండానే పథకాలు ఇవ్వడం వల్ల జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో మమకారం పెరిగిందన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నా ప్రతిపక్ష పార్టీలు ఉద్దేశ పూర్వకంగా విమర్శలు చేస్తూ ప్రభుత్వానికి అప్రతిష్ట తెచ్చేందుకు యత్నిస్తున్నాయని స్పష్టం చేశారు. సీనియర్ నాయకుడు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సైనికుల్లా పని చేయడం వల్లే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం విజయవంతమైందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు గంధం వెంకటశేషయ్య, బీ గోవర్ధన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, సర్పంచ్ బీ సుప్రియ, నాయకులు పీ అచ్యుతరెడ్డి, ఎస్ మాణిక్యరావు, చక్కా మనోహర్, చిమటా శేషగిరి, ఆర్ రాజేష్‌రెడ్డి, ఎస్ శ్రీధర్‌రెడ్డి, డీ శివకుమార్ పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో సేవలందించాలి

• కావలి ఆర్డీఓ శీనానాయక్


అధికారులకు సూచనలు ఇస్తున్న కావలి ఆర్డీఓ శీనానాయక్

కొడవలూరు: రైతులకు సంబంధించిన ఏ సేవలైనా సకాలంలో అందించాలని కావలి ఆర్డీఓ శీనానాయక్ సూచించారు. మండల తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రైతులకు భూ హక్కు పత్రాలు సకాలంలో అందజేయడంతో పాటు ఈ–కేవైసీ తప్పక చేయించాలన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతుల సమక్షంలోనే హద్దు రాళ్లు నాటడాన్ని వెంటనే పూర్తిచేయాలన్నారు. రైతులకు సంబంధించిన సేవలను నిర్దేశించిన సమయంలోగా విధిగా పూర్తి చేయాలన్నారు. నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయని పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రమాదేవి, డీటీలు గున్నం మల్లికార్జున, మధుసూదన్‌రావు, సర్వేయర్ మాబాషా, ఆర్ఐ చాణక్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

గిరిజన చిన్నారి వైద్యానికి నగదు సాయం



కోవూరు: గుమ్మళ్లదిబ్బ ప్రాంతానికి చెందిన గంధళ్ల అమరబాబు, సుభాషిణి దంపతుల చిన్నారి ప్రణవి వైద్యఖర్చులకు డీఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్ బాబురెడ్డి బుధవారం రూ.20వేలు సాయం అందజేశారు. మూడేళ్ల చిన్నారి ప్రణవికి గుండెలో రంధ్రం ఏర్పడడంతో తల్లిదండ్రులు చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి రావడంతో వెంటనే చిన్నారికి రూ.20వేలు ఆర్థిక సాయం చేయాలని నిరంజన్‌బాబురెడ్డికు సూచించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో చిన్నారి తల్లిదండ్రులకు నగదు అందజేశారు. వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పన్యం సుధాకర్, ఎంపీటీసీ విజయసేనారెడ్డి, శివకుమార్‌రెడ్డి, ఎన్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ఆత్మబంధువు సీఎం వైఎస్ జగన్


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాలకు పెద్దపీట వేస్తూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆత్మబంధువుగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పడుగుపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇటీవల లోకేష్ పాదయాత్రలో దళితులు పీకేందేమి లేదు..పొడిచింది ఏమి లేదని మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. అదే దళితుల ఓట్లతో గెలిచిన నీ తండ్రి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 9 ఏళ్లు, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్ల పాటు అధికారం వెలగబెట్టిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీ కులంలో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారాని మాట్లాడారన్నారు. మరో టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మీరు దళితులు మీకేందుకు రాజకీయాలు అని పరుష పదజాలంతో దూషించారని గుర్తుచేశారు. అటువంటి చరిత్ర కలిగిన టీడీపీ తమ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాలకు పెద్దపీట వేస్తూ ప్రతి వర్గాన్ని మంత్రి వర్గంలో కూర్చోబెట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మంత్రి పదవి ఇవ్వకుండా ఎస్టీలను అవమానించిన చరిత్ర చంద్రబాబుది అన్నారు. ముస్లిం మైనార్టీలను సైతం పక్కన పెట్టి చివరి ఆరుమాసాల్లో ఓట్ల కోసం మంత్రి పదవి ఇచ్చారని గుర్తుచేశారు.

ప్యాకేజీకి అమ్ముడుపోయిన బాబు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా విషయంలో నిరంతరం పోరాటం చేసి రోడ్ల మీద రాస్తారోకోలు చేపట్టిన చరిత్ర వైఎస్సార్‌సీపీది అని ఎమ్మెల్యే ప్రసన్న అన్నారు. ప్యాకేజీకి అమ్ముడుపోయి నగదు తీసుకుని ఢిల్లీ నుంచి ఆంధ్రాకు వచ్చిన బాబుకు ప్రత్యేక హోదా గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పేదల వైపు కన్నెత్తి చూడని బాబు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్సీపీకి ఓటు వేయని వారికి కూడా అర్హత ఉంటే సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. ప్రజల ఆశీర్వాదం ఉన్నంతకాలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని చంద్రబాబు ఏమి చేయలేరన్నారు. డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, వైఎస్సార్సీపీ జిల్లా యువజన అధ్యక్షుడు మాళెం సుధీర్‌రెడ్డి, ఏఎంఏబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, వైస్‌ఎంపీపీ నరసింహులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఎన్‌ఎస్సార్ ట్రస్ట్ చేయూత


చిన్నారులకు బాండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేయూతనందించారు. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.1.45 లక్షల సాయాన్ని అందజేశారు. మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఎమ్మెల్యే ప్రసన్న కొడవలూరులో పర్యటించారు. ఆ సమయంలో తల్లిదండ్రులు కోల్పోయిన చిన్నారులకు ఆర్థిక సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు కొడవలూరుకు చెందిన నంబూరు నానీకి రూ.20 వేలు, నంబూరు గంగాభవానీకి రూ.20 వేలు, రేణుకశ్రీకి రూ.20 వేలు, అరిగెల తనయ్‌కుమార్‌కు రూ.20 వేలు, ఎస్ జోషితకు రూ.20 వేలు, ఎస్ నిహారికకు రూ.20 వేలు, దళితవాడకు చెందిన మన్యం అక్షయ్‌కు రూ.25 వేలు చొప్పున బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. బుధవారం కోవూరులో చిన్నారుల కుటుంబ సభ్యులకు బాండ్లు అందజేశారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, నాయకులు ఒట్టూరు సునీతమ్మ, నక్కా తిరుపతమ్మ, పొబ్బా రవి, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల ఉచ్చులో పడొద్దు

• డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి


తనిఖీలు చేస్తున్న డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి

కోవూరు: ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల ఉచ్చులో పడొద్దని డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి పొదుపు సభ్యులకు సూచించారు. కోవూరులోని ప్రైవేట్ ఫైనాన్స్ కార్యాలయాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాలకు బ్యాంకులు, అనుబంధ సంస్థల ద్వారా రూపాయి వడ్డీకే రుణాలు ఇస్తున్నామని తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని పొదుపు సంఘాలకు రూ.1030 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, అంతకుమించి రూ.1049 కోట్లు రుణంగా ఇచ్చామని వివరించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.1061 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ప్రభుత్వం పొదుపు సభ్యుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తుంటే ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయించి మోసపోవడం మంచిదికాదన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలను సకాలంలో తిరిగి చెల్లించి ఆర్థికంగా స్థిరపడాలన్నారు. జిల్లాలోని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల పైన ప్రత్యేక దాడులు నిర్వహించాలని ఉన్నతి అధికారుల ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ మేరకు ఆరు బృందాలుగా ఏర్పడి కందుకూరు, కావలి, బోగోలు, ఆత్మకూరు, నెల్లూరు, తదితర ప్రాంతాల్లోని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఆర్‌బీఐ సూచించిన పదమూడు అంశాలకు సంబంధించి ఐదురోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేశామన్నారు. ఐదురోజుల్లో వివరణ ఇవ్వకపోతే కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పొదుపు మహిళలను అమాయకులుగా పరిగణించి నగదు ఆశ చూపించి ఎక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వడం మంచిపద్ధతి కాదన్నారు.

సచివాలయంలో తనిఖీలు

కోవూరు సచివాలయం–2ను డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. 90 శాతం హాజరు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు.

రీ సర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం


డ్రోన్‌ను ఎగురవేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మనుబోలు: రీ సర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొమ్మలపూడిలో డ్రోన్ సాయంతో చేపడుతున్న రీ సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. సర్వే సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. రీ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో హద్దు రాళ్లను నాటడాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. రీ సర్వేతో ఖచ్చితమైన కొలతలు తెలుస్తాయని, తద్వారా రైతుల భూ సమస్యలు తొలగిపోతాయని తెలిపారు. సర్పంచ్ బందెల వేణుగోపాల్, ఎంపీటీసీ శిరీష, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు నాగూర్‌బాషా, పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, వీఆర్వో శ్రీనివాస్, సర్వేయర్లు గోపికృష్ణ, వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.